**నమ్మలేని నిజాలు**

ప్రజా ద్రోహులు
కోట్లకు వారసులు
గూడు ఒకటే.

పండుగ విందు
మందు మాంసం వేడుక
పేదలు దూరం.

రంగులు వేరు
అంతా తెలుపుమయం
కుర్చీ కై జనం

తేనె మాటలు
రాచకీయ జిహ్వలు
మైకంలో ఓట్లు

క్రాంతి దారులు
కాంతిమయ తీరాలు
శ్రమ ఫలాలు.



– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**శ్రీ నిజాలు**

రెండు తల్లులేమి లొల్లి
ఒకటే నా తెలంగాణ !
నిండు హృదయాల్లో ఉన్న
కోటి రత్నాలది వీణ !
పార్టీకొక దేవతైతె
తెలంగాణ తల్లులు !
మీ చేతల వల్ల మాకు
గుండెల్లో ముల్లులు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 5-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:95 పేజీలు:6 వెల: రూ.1/-

# పెద్దపల్లి జిల్లాకు ముఖ్యమంత్రి వరాల జల్లు



కరీంనగర్, డిసెంబర్ 4: పెద్దపల్లిలో నేడు నిర్వహించనున్న యువ వికాసం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ, ముఖ్యమంత్రి రేవంత్ ఆ జిల్లాకు వరాలు కురిపించారు.. పెద్దపల్లికి రూరల్ పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ను మంజూరు చేశారు. ఎలిగేడు మండల కేంద్రానికి పోలీసు స్టేషన్, వ్యవసాయ మార్కెట్ను మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి ఇచ్చారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి 4 వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు. అలాగే పెద్దపల్లి బస్సు డిపోను కూడా మంజూర చేసేశారు రేవంత్.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న యువజన వికాస విజయోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. కాసేపట్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు హాజరుకానున్నారు. సభలో 9 వేల మంది నిరుద్యోగులకు నియామకపు పాత్రలు అందించనున్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకోనున్నారు. ఈ వేదికనుండే సీఎం కప్ పోటీలను ప్రారంభించనున్నారు. బహిరంగ సభ కోసం జిల్లా నేతలు లక్ష మంది జన సమీకరణ కోసం ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభాస్థలికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రోటోకాల్ చైర్మన్ హర్కార వేణుగోపాల్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు సభా స్థలికి చేరుకున్నారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పర్యవేక్షిస్తుండగా, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మల్టీ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం సిపి శ్రీనివాసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. 82 కోట్ల రూపాయలతో నిర్మించే పెద్దపల్లి బైపాస్ రోడ్డు, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణాలకు. జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో స్వశక్తి మహిళా ప్రాంగణం భవన నిర్మాణానికి, రామగుండం నియోజకవర్గంలో రూ. 60 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు, మంథనిలో ఆర్అండ్‌బీ పెండింగ్ రోడ్ల పూర్తికి, రూ. 10 కోట్లతో అంతర్గాంలో, మంథని గంగపురిలో, పోతారం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు, అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో బండ్లవాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పూర్తికి, జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపాలిటీల పరిధిలో రూ. 51 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 80 కోట్లతో చేపట్టే పనులకు, కాల్వశ్రీరాంపూర్ నుంచి మొట్లపల్లి రూ. 25కోట్లతో, పీడబ్ల్యు రోడ్ నుంచి ఎల్లంపల్లి వరకు రూ. 7 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు, రూ. 6 కోట్లతో గర్రెపల్లి నుంచి ఎలిగేడు వరకు రహదారి విస్తరణ, రూ. 5 కోట్లతో హుస్సేన్ మియా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి, రూ. 12 కోట్లతో సుగ్లాంపల్లి నుంచి ధూళికట్ట వరకు రహదారి విస్తరణ పనులకు, రామగుండంలో రూ. 60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, మంథనిలో బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి, మంథని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులను ప్రారంభించనున్నారు. 2.45 కోట్ల రూపాయలతో నిర్మించే గుంజపడుగులో 30 పడకల ఆస్పత్రికి, పెద్దపల్లి 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులను ప్రారంభించనున్నారు. పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లతోపాటు ఎలిగేడులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించనున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి అన్ని హంగులతో పనులు నిర్వహించేలా శంకుస్థాపన చేయడం తోపాటు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.

### 9 వేల మందికి నియామక పత్రాలు

యువజన వికాస విజయోత్సవ సభలో 9 వేల మంది నిరుద్యోగులకు నియామకపు పత్రాలు సీఎం అందించనున్నారు. 500 మందికి సింగరేణి ఉద్యోగాల నియామకాలు, గ్రూప్– 4, ఇతర ఉద్యోగాలు దాదాపు 8500 మందికి ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారు.

# ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో హార్వెస్టర్ దగ్ధం.. తప్పిన పెను ప్రమాదం

వరంగల్, డిసెంబర్ 4: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కైలాపూర్, శాంతినగర్ గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం వరి పొలం కోస్తున్న హార్వెస్టర్ ఇంజన్ లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒకేసారి మంటలు రావడంతో డ్రైవర్ రాజు తృటిలో ప్రమాదం నుండి తప్పించుకున్నాడు.

దీంతో హార్వెస్టర్ లో మంటలు రావడంతో కాలిపోతుండగా సమాచారం తెలుసుకున్న చిట్యాల ఎస్సై జి.శ్రావణ్ కుమార్ వెంటనే తమ సిబ్బందితో వెళ్లి రైతుల సాయంతో వ్యవసాయ మోటార్ పైపుల ద్వారా నీళ్లతో మంటలు ఆర్పివేశారు. లేకుంటే వరిపొలాలు అంటుకొని పెద్ద ప్రమాదం చోటు చేసుకొనేదని రైతులు అన్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కనపర్తికి చెందిన పత్తి శ్రీనివాస్ రెడ్డి హార్వెస్టర్ ను పెంట ఓదెలు వరి పొలం కోస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనతో ఎలాంటి అపాయం (ప్రమాదం) జరగకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

# రాజకీయాలలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇస్తాం- రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 4:రాజకీయాలలో ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.. అలాగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చిరస్మరణీయమైన సేవలు అందించిన మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తామని అన్నారు..

హైదరాబాద్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నేడు జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాల్లో రోశయ్య సూచనలతో రాజకీయాలపై తాను అవగాహన పెంచుకున్నానని అన్నారు. ఆయనను ఎదిరిస్తూ తాను శాసనమండలిలో మాట్లాడానని గుర్తు చేశారు.





### మిగులు బడ్జెట్ ఆయన ఘనతే

రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందంటే రోశయ్య 16 ఏళ్లు ఆర్థిక మంత్రిగా పని చేయడమే కారణమని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని రోశయ్య తనకు చెప్పేవారని సీఎం అన్నారు. ఆయన సూచనలతోనే రాజకీయాలపై అవగాహన పెంచుకున్నానని తెలిపారు. ముఖ్యమంత్రులు ధీమాగా అన్ని సంవత్సరాలు పాలించారంటే రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉండటం ఓ కారణమని అన్నారు.

రాష్ట్రానికి సీఎంగా ఎవరున్నా రోశయ్యకు నెంబర్ 2 పొజిషన్ పర్మినెంట్‌గా ఉండేదని అన్నారు. తనకు పదవి కావాలని ఎవరినీ ఏనాడు ఆయన అడగలేదని తెలిపారు. ఆయనకు ఉన్న ప్రతిభ, క్రమశిక్షణే వల్లే వివిధ హోదాలు దక్కాయని సీఎం అన్నారు. చట్టసభల్లో రోశయ్య బలమైన ముద్ర వేశారని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక రంగంలో రాణించాలంటే ఆర్య వైశ్యుల పాత్ర ప్రముఖమని అంటూ రాజకీయాలలో ఆర్యవైశ్యులు చురుగ్గా పాల్గొనాలని రేవంత్ పిలుపు ఇచ్చారు.. ఆర్యవైశ్యులు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శిగా దాన కిశోర్ కు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4:రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# శబరిమల భక్తులతో వెళ్తున్న బస్సును ఢీ కొట్టిన లారీ.. ఒకరు మృతి



కేరళ, డిసెంబర్ 4:రాష్ట్రం కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శబరిమల భక్తుల తో వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డజను మందికిపైగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3:45 గంటల ప్రాంతంలో ఆర్యన్‌కావు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న లారీ.. బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన 40 అడుగుల లోతులోకి పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు సేలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో చిన్నారులు, వృద్ధులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# తిరుచానూరులో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. సూర్యప్రభ వాహనంపై పద్మావతి దర్శనం



తిరుపతి, డిసెంబర్ 4:తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు బుధవారం అమ్మవారు గోవర్ధనగిరిధారియైన శ్రీ కృష్ణుని అలంకారంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు.

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవ కొనసాగగా భక్తులు అడుగడుగునా నారికేళం, కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. సూర్యప్రభ వాహనంలో అమ్మవారి దర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుందని అర్చకులు తెలిపారు.

రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పద్మావతి అమ్మవారు చంద్రప్రభ వాహనంపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్, ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

# కొండపల్లి బొమ్మ కళకు పునర్వైభవం తెద్దాం.. కలెక్టర్ డా.లక్ష్మీశ

అమరావతి, డిసెంబర్ 4: తెలుగు నేల సంప్రదాయ కళా ఔన్నత్యానికి కొండపల్లి బొమ్మలు చిహ్నమని.. సమష్టి కృషితో కొండపల్లి బొమ్మ కళకు పునర్వైభవం తెద్దామని, కళా సుస్థిరతకు ప్రభుత్వ పరంగా పూర్తి మద్దతు ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ, డ్వామా, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి కొండపల్లి బొమ్మల కళాకారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు.

బొమ్మల తయారీకి ముడిసరుకు అయిన తెల్ల పొణికిని పరిశీలించడంతో పాటు కళాకారులు అద్భుత నైపుణ్యంతో చెక్కను అందమైన బొమ్మగా తీర్చిదిద్దుతున్న విధానాన్ని పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపున్న కొండపల్లి బొమ్మలకు డిమాండ్‌తో పాటు మార్కెటింగ్ అవకాశాలు బాగున్నప్పటికీ బొమ్మ తయారీకి అవసరమైన తెల్ల పొణికి లభ్యత సమస్యగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తెల్ల పొణికి నర్సరీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయన్నారు. తెల్ల పొణికి లభ్యతను పెంచేలా ఫారెస్టు, డీఆర్‌డీఏ, డ్వామా తదితర శాఖల సమన్వయంతో కృషిచేయనున్నట్లు తెలిపారు.

సమస్య పరిష్కారానికి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక జాయింట్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఒకవైపు అటవీ నిబంధనలను పాటిస్తూనే మరోవైపు తెల్ల పొణికి కళాకారులకు అందుబాటులో ఉండేలా పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

కళను ప్రోత్సహించి, సంప్రదాయ కళా సంపదను భావితరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్‌వో జి.సతీష్, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు : దేవేంద్ర ఫడ్నవీస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: తనను మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ ఎమ్మెల్యేలు అందరికీ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కృతజ్ఞతలు తెలిపారు. 'నన్ను ఏకగ్రీవంగా శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు. కేంద్ర పరిశీలకులు విజయ్‌రూపానీ, నిర్మలా సీతారామన్‌లకు కూడా కృతజ్ఞతలు' అని ఫడ్నవీస్ చెప్పారు. ఈసారి మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు చారిత్రాత్మక ఎన్నికలని, ఈ ఎన్నికల ద్వారా 'ఏక్ హై తో సేఫ్ హై' అదేవిధంగా 'మోదీ హై తో మమ్కిన్ హై' అనే విషయం రుజువైందని ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. దేశంలో తమ విజయాల పరంపర పునఃప్రారంభమైందని ఆయన చెప్పారు. ఇంతకుముందు హర్యానాలో, ఇప్పుడు మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయాలు సాధించిందని అన్నారు. మహారాష్ట్ర ఓటర్లు బీజేపీకి కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారని, వారందరికీ తాను శిరసు వంచి నమస్కరిస్తున్నానని ఫడ్నవీస్ తెలిపారు.

# ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి..

## –గవర్నర్‌కు మహాయుతి నేతల వినతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:మహారాష్ట్రలో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడి 11 రోజులైనా సీఎం ఎంపికపై పీటముడి వీడకపోవడంతో సస్పెన్స్ కొనసాగింది. చివరకు సీఎం ఎంపికపై మహాయుతి కూటమిలోని మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బుధవారం ఉదయం బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై దేవేంద్ర ఫడ్నవీస్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంది.





మధ్యాహ్నం దేవేంద్ర ఫడ్నవీస్.. కూటమిలోని శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్‌లతో కలిసి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి తమను ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వానించాలని కోరారు. తమకు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం ఉన్నదని చెప్పారు. కాగా దేవేంద్ర ఫడ్నవీస్ రేపు (నవంబర్ 4న) సాయంత్రం దక్షిణ ముంబైలోని అజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఇద్దరూ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితరులు హాజరుకానున్నారు.

**చురక**

కులం ఎంతకాదన్నా
గళం పెంచుకుంటుంది
పరువుపేరా హత్యల్లో
పాలుపంచుకుంటుంది
వివక్షలే కాదు ఇంకా
వివాహాల్లోను వీరభద్ర
పురోగామి సమాజంలో
ప్రమాదంగా దాని ముద్ర



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం– నేటికి అందం**

పరగెడి జాత్యభివృద్ధికి
నరమరికలు లేని సేవ లందించంగన్
వరములు శతాధికమ్ముగ
కురియును స్వచ్ఛంద సేవకులపై భవుడున్ !!

(డిసెంబరు 5 స్వచ్ఛంద సేవకుల దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# కవులను సత్కరించిన దోహా టిపిఎస్



ఖతార్ దేశ రాజధాని దోహా పర్యటనలో భాగంగా తెలంగాణ కవులకు ఘన సత్కారం జరిగింది. నవంబర్ 22, 23 తేదీలలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు హాజరైన తెలంగాణ కవులు మౌనశ్రీ మల్లిక్, నామాల రవీంద్రసూరి, ప్రకాష్ చౌదరపు, పత్తిపాక సురేందర్ కు దోహాలో మరో అరుదైన గౌరవం లభించింది.

సదస్సు అనంతరం దోహా నగరాన్ని సందర్శిస్తున్న విషయాన్ని ప్రభాస్ భారతీయుడైన ఇంజనీర్ నామాల సురేందర్ 'తెలంగాణ ప్రజా సమితి' సభ్యులకు తెలిపారు. సంస్థ సభ్యులు వెంటనే స్పందించి, కవులకు ఇండియన్ అంబాసి కల్చరల్ సెంటర్లో గౌరవ సత్కారం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు.

ఈ సత్కార కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తిరుపతి చెనవేని, అంజయ్య వట్టెంల, గంగాసాయి అవుట్ల, కృష్ణ కుసుమ, రాకేష్ యాదవ్, అనిల్ బొడ్డు, హారిక గడ్డం, సురేందర్ నామాల, శ్రీనివాస్ కొత్తపల్లి, కిరణ్ పొడకంటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కవి మౌనశ్రీ మల్లిక్ తను రాసిన గీతాలను పాడి అలరించారు. నామాల రవీంద్రసూరి, ప్రకాష్ చౌదారపు, సురేందర్ పత్తిపాక తమ స్వీయ కవితలను వినిపించారు.

సభ జరిగిన మరుసటి రోజు కవులకు దోహా నగరంలోని అతిపెద్ద హోటల్ శరటన్ గ్రాండ్ లో విందు ఇచ్చి వీడ్కోలు పలికారు.

దోహా నగరంలో తెలంగాణ ప్రజా సమితి ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తున్న తెలంగాణ సభ్యులకు కవులు అభినందనలు తెలిపారు.




## సంఘర్షణ లోంచి

కోర్కెలు ఎక్కిపెట్టే బాణాలు
ఎడారి జీవిత ప్రయాణానికి
కొలువులౌతాయి.
ఇవి ఎప్పటికీ తడి తడిగా
ఆనందాల్ని విరబూయలేవు.
మనకు మనమే
ఇనుప కంచెలు వేసుకుని
అసంతృప్తి తీరాలని వెంబడిస్తున్నాం.
ప్రకృతి జీవి కదా
స్వేఛ్ఛా విహంగాల పై
కలలను అద్దుకుని బతికేది.
ఎన్ని రెక్కలు కట్టుకు ఎగిరినా
బాధను శ్వాసిస్తే
ఏ కాలం ఏం చెబుతుంది.
ప్రశ్నించు
సమాధానం మొలకెత్తించు
లోలోపల అగ్ని గోళాలని రగిలించు.
ఎప్పుడు గొంతు విప్పాలో
ఎప్పుడు మౌనం వహించాలో
అనుభవం నేర్పిన పాఠాలలోంచి
పరిమళించాలి కదా మనం .
మొక్కని నులిమి ఆలోచనల మధ్య
చెట్టుగా మారటం
పది మందికి నీడ నివ్వటం
సవాలుతో సహవాసం చేయటం లాంటిదే .
అనేక సంఘర్షణల్లోంచి
మొలకెత్తడం
ఆలోచించడం
ప్రకృతిలా వికశించటంలోనే
వుంది జీవితం.



**-గవిడి శ్రీనివాస్**
7019278368

## నానీలు

సర్వ వ్యాపకం
వేమన పద్యం, గాలిలా!
ఎంత గ్రోలినా
మధురమే తేనెలా!

అందనంత ఎదగాలని
అందరి ఆశ.
శ్రమ ఒక్కటే
అటు చేర్చే దిశ.

మేసే ఓటరు
మేపే లీడరూ,
ఈ ఇద్దరే ప్రజాస్వామ్యానికి
కాన్సర్ కణాలు!

'ప్రశ్నలు'. సంధిస్తేనే
పరిష్కారం.
లేదంటే ఎలుక పైనే
ఏనుగు భారం!

సుకవి
మహా నియంత.
అక్షరపాశం తోనే
అదుపు చేయునంతా.!

కోట్లిచ్చినా
చప్పట్ల పైనే ఆశ.
ఊపిరాగినా
అక్షరమే కవి శ్వాస.

**-మాయకుంట్ల నారాయణరెడ్డి**
99896 86603



## భరత మాత

అవని పై అవతరించిన వేదకాల దేశం
అవనికే అవతారిక భారతదేశం
అవనిని మాతగా కొలిచే ఏకైక దేశం
అవనిలో అమరపురి భారతదేశం.
అమరెను నీ అఖండ భౌతిక రూపు
అచ్చమైన ఆ చల్లని మాత చూపు.
దిక్కులు మూలలు అష్టదిక్కులు
నీవే మాకు దిక్కని మ్రొక్కెదము.
దక్షిణ దిక్కున పవిత్ర పాదములు
కడలి అంచున నిలిచిన శ్రీపాదములు
దేవుళ్ళైన మొక్కే దివ్య చరణములు
తూర్పు పడమరలు శుభకరములు
దినకరుని మ్రొక్కేటి శ్రీకరములు
కోదండ మెత్తిన శ్రీరామ కరములు.
ఉత్తరాన ఉత్తుంగ హిమశిఖరం
అది శివుని శిరస్సున జటాజూటం
అల్లన పారే పవిత్ర గంగా ప్రవాహం
జీవులు తరించే అమృత తీర్థం!.
అవతార మూర్తులు అవతరించిన
పుణ్యభూమి
మానులు ప్రాణులు పక్షులు మాట్లాడిన
పవిత్ర పుడమి.
భరత మాత అణువణువు అమ్మ ప్రేమ
బారమంత నీదేనని మా ధీమా.
అదృష్టవంతులం నీ ముద్దు బిడ్డలం
భరతమాత నీకు సదా వందనం.

**-పి.బక్కారెడ్డి**
9705315250



## ఆనంద క్షణాలు

తెరచాటున దాగిపోయిన
మొరటు పనుల ఆనందాలు
అప్పుడప్పుడు అలారంలా
గొప్ప గొప్ప అనుభూతులు
కాలం పొరలలో
కమ్ముకు పోయిన..
కమ్మని చిలిపి
తలపుల జాడలు
తప్పని మార్పుల
తీర్పులు చెబుతుంటే..
సన్న జాజుల
సౌరభమే దరహాసముపై...
మంద్రపు నీలములలో
సంద్రపు అలల ఛాయలా
పండు వెన్నెల పాన్పులపై
ఆట కోయిలలమై ఆడినప్పుడు
మధురమైన సీతాఫలాల
వేటకై గుట్టంతా గాలించగ
తోటమాలి కోప తాపాలకు
గూబలు గుయ్ మన్న గుంభనాలు
బుద్ధిమంతుల సద్దిముల్లెలా
సుద్దులన్నీ సుబ్బరంగా విని
మరువలేని మర్కటపు ఛాయలు
వదలని కోతి కొమ్మచ్చి
ఆటల దూకుళ్లు ఒకటా రెండా..
మదినిండా
బాధ్యతల బందీలమై పేజీలు
దొర్లిపోయి నిక్షిప్తమైన నిగూడపు
నీడలు వంపుకుంటే
కమ్మని మధురిమలు.

**-నగునూరి రాజన్న**
8332963129



## అమ్మ చెప్పింది

కథ

బడి గంట మోగింది.చకచకా పిల్లలు అందరూ బడి నుండి ఇళ్ళకు బయలుదేరారు.రాజు ,భీముడు ,రాము కలిసి నడుస్తున్నారు. వీరు ముగ్గురు మంచి స్నేహితులు. అరేయ్ భీముడు ! రేపు నా పుట్టిన రోజుఅన్నాడు రాజు. దానికి భీముడు అవునా? భలేభలే! అయితే రేపు నువ్వుమా అందరికి చాక్లేట్స్ ఇస్తావా? లడ్డూలు ఇస్తావా? అన్నాడు . భీముడికి లడ్డూలంటే చాలా ఇష్టం.దానికి రాజు నేనుచాక్లేట్స్, బిస్కట్స్ ఇస్తాను అన్నాడు. భీముడు నేను కూడానా పుట్టిన రోజునాడు మంచి మంచి మిఠాయిలు ఇస్తానుఅంటూవుండగా ఇంతకీ నీ పుట్టిన రోజు నాడు నువ్వు ఏమి ఇస్తావు?అన్నాడు రాజు వారితో పాటుగా వస్తున్న రాముని. నేను చాలాపెద్ద,పెద్ద బహుమతులు ఇస్తాను ..కాని ఇప్పుడు కాదు , కొంచెం పెద్దయిన తర్వాత అన్నాడు రాము. రాము మాటలు రాజుకి,భీముడికిఅర్థం కాక ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ అదేంటి ? పెద్దయినతర్వాత అంటున్నావు మాకు అర్థం కాలేదు అన్నారు ఇద్దరూ ఒకేసారి. దానికి రాము నేను ప్రతిసంవత్సరం నా పుట్టిన రోజు నాడు ఒక మొక్క నాటుతాను. అవి పెద్దవైన తర్వాత పక్షులకు గూడులా,పశువులకు నీడలా, వర్షానికి గొడుగులా, ఆకలితోఉన్నవారికి ఆహారంపెట్టే అమ్మలా, నిరాశ్రయులకు, బాటసారులకు ఆశ్రయంలా ఇలాఅనేక రకాలుగా ఉపయోగపడతాయని చెప్పి నాతో మా అమ్మ ప్రతిసంవత్సరం నా పుట్టిన రోజునాడు ఒక మొక్క నాటిస్తుంది. కానిచెట్లను కొట్టేయడం వల్ల మానవునితో సహా,పశు పక్ష్యాదులుఅనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ,పర్యావరణాన్ని కాపాడే విధంగా చెట్లను నాటడం వలన సకాలంలో వర్షాలుకురుస్తాయని అమ్మ చెప్పిందని చెప్పాడు. రాము చెప్పినమాటలకు రాజు, భీముడు నువ్వు పెద్దయిన తరువాత ఇచ్చే పెద్దబహుమతి ఏంటో ఇప్పుడు మాకు అర్థమయ్యింది అన్నారు .ఇప్పటినుండి మేము కూడా మా పుట్టిన రోజునాడు ఒక మొక్క నాటుతాముఅని అన్నారు. వీరిని అనుసరిస్తూ వస్తున్న ఉపాధ్యాయుడు వీరిమాటలను విని మరుసటి రోజు రాము చేస్తున్న మంచి పని గురించిఅందరికిచెప్పి తనని ఎంతగానో మెచ్చుకున్నాడు . పిల్లలందరూ రాముని అభినందిస్తూ చప్పట్లు కొట్టారు.పిల్లలూ ! మీరందరుకూడా ప్రతి పుట్టిన రోజునాడు ఒక మొక్కనాటుతారు కదూ! అంటూఉపాధ్యాయుడు అందరిని ప్రోత్సహించాడు . ఇలా మొక్కలు నాటినవారికి బహుమతులు ఇస్తానని ప్రకటించాడు. ఉపాధ్యాయుడు ఇలాచెబుతుండగా గంట మోగింది. రాము తరగతి బయటికి తొంగి చూశాడు .ఒకమొక్క తన కొమ్మలతో అటూ ఇటూ ఊగుతూ తననుపిలుస్తున్నట్టుగా అనిపించి నవ్వుతూ ఆ మొక్క దగ్గరికినడిచాడు.

**-ధూళిపాళ్ళ లిఖిత్ సాయి.**
6వ తరగతి.
శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్
పాఠశాల. గుంటూరు. .



## అధికారపు టెక్కు

సమ సమాజపుటద్దంలో అధికార దర్పాన్ని
విధి నిర్వహణలో ధర్మదేవతకు అంకితం చేసి
మూడు పువ్వులు ఆరు కాయల్లా
అభివృద్ధి పరిచే బలమున్న ఖలేజా.....
నేడు కలికాలపు మాయ స్వార్థంలో
సమ గౌరవం అందించకుండా
సాధింపుల ఆనందంలోతొత్తులుగా ముల్లెలు మొయించడం
చెప్పుడు మాటలు వినడం చేతికందినంత దోచుకోవడం
నోటి దురుసుతో అక్కస్సును కక్కడం
ఎదురు తిరిగితే అణచివేతతో
పనిభారపు మూల్యాన్ని శాశ్వతం చేయడం
అందరిలో అవమానపు చురకలు పెట్టడం
కన్నీటి తడిని చూసి రాక్షసానందం పొందడం
ఒకటేమిటి అంతా వినాశకాలే విపరీత బుద్ధి...
చేతులు కాలాక ఆకులు పట్టినట్లు
ఉసురు తగిలి పూర్తి నాశనమయ్యాక
నిట్టూర్పుల సెగల నీడలో వింత రోగాల పూలు పూయడం
అతీ గతి లేని బతుకు తయారు చేసుకోవడం..
ఈ అధికారపు టెక్కులతో
మారని మనిషి నైజంలో
ఉత్తములెందరో బలియైపోతుంద్రు.....!!.

**-చిందం సునీత**
9701075502



## ఎర్ర శాలువా...

దినమంతా కంపు కొట్టే
రాజకీయ వాసనలు చూసీ చూసీ
ఇక లాభం లేదనీ
మనసును ప్రయాణ చక్రాలకు చుట్టేసా
వారాంతంలో అక్కడికి వెళ్ళా
అదే..సుందరయ్య విజ్ఞాన కేంద్రం
సాహిత్య సౌరభాలు కొంత సేపైనా
పీల్చుకుని.. ఊపిరి తెచ్చుకుందామనీ.
పంకాగాలి కాస్త తగులుతున్న
సీటొక్కటి చూసుకుని
కూలబడి పోయాను..
కూసిన్ని నీళ్ళు తాగి
కవి దిగ్గజాల వాక్ ఝరికీ
నన్ను నేను కోల్పోతున్న తరుణంలో
నా పక్కనే పరుచుకున్న ఎర్ర శాలువా
నన్ను తాకుతూ మందలించింది.
ఎవరైనా కుర్చీ కోసం వేసారో
ఎవరి నుంచైనా
అదే జారిపోయిందో
దాని పూర్వ కథ తెలియదు
కానీ
మదిలో
మనో నేత్రాన్ని తట్టింది.
దాన్ని మరింతగా తడిమి చూసా
ఎన్నో చెమట చుక్కలు..
మరెన్నో కన్నీళ్లు
దాని మడతల్లో దాగున్నట్టనిపించింది
గుప్పుమన్న అక్షరాల వాసనోచ్చింది
మోసిన..రాసిన సాహిత్య పుస్తకాల
కీర్తినంతా అదే చుట్టేసుకున్నట్టనిపించింది.
వస్త్రం ఓ గొప్ప సంకేతం సుమా..
అరుణ వర్ణంతో గుండెనెంత మండిస్తొందో
ఎన్ని విప్లవ భావాలు అందులో
పోగులు పోగులుగా పొదగ బడ్డాయో.
ఆ ఎర్ర శాలువాను నాతో
తెచ్చేసుకుందాం అనుకున్నా కానీ..
పురాస్మృతుల్ని కప్పుకున్న అది
నాకెంతో బరువనిపించింది
బాధ్యతాయుతమైన వలువనిపించింది
వందనాలతో
దాన్నక్కడే వొదిలి కదిలా..!

**-కటుకోఝ్వల రమేష్**, సెల్:9949083327



## బాలలు

ఉదయించే కిరణాలు బాలలు
బడికి వెలుగులు బాలలు
చదువుల తల్లి బిడ్డలు
చిరునవ్వుతో చిందులేస్తుండే బాలలు
సంతోషానికి మారుపేరు బాలలు!!.
ప్రగతికి బాటలు బాలలు
భరతమాత ముద్దుబిడ్డలు
ఎదుగుతున్న పిల్లలు
భావితరానికి వెలుగు దివ్వెలు!!.
బాలలు బంగారు కిరణాలు
అవనిలో వెలిసిన చిరు మొగ్గలు
స్వచ్ఛమైన మనసుకు చిరునామా
బంగారు భవితకు పునాదులు
చిరునవ్వుకు చిరునామా బాలలు!!

**-దేవులపల్లి సారిక రమేశ్**
9963701294



## అనుచితం

ఏనాటి చినుకో
ఏరులై నదులై సంద్రమై
మరల చినుకై నిను చేరదా! .
ఈరోజే కాసింత
మంచిని పోగేసుకో
రేపటి జ్ఞాపకాల కోసం!
మంచికి
చెడు ఎదురయిందా...
మెదడులో రీసైకిల్ బిన్
చిప్పుని నిక్షిప్తం చేసుకో
లేదా డిలిట్ ఆప్షన్ ఎంచుకో!.
రామసేతుకి సహాయం చేసిన
ఉడుతపాటి కాదా మనం
రెక్కలకష్టం బలమైనపుడు
భవిష్యత్తు ప్రశ్నార్థకం కాదు కదా!.
ఇచ్చేవారు ఇస్తున్నారని
చేయిచాస్తూ ఉండటమేనా
నీ నిండిన చేతులవెనక
ఎన్నెన్ని రిక్తహస్తాలో...
రేపును శాసించే
భయంకర నిజాలో!
ఏ ఉచితమైనా అనుచితమే
అది దేశ భవితకు
కాదు ఉచితం!

**-లలితావర్మ**
9949672671



## సునందామృతం

### తప్త పరశుగ్రహణ న్యాయము

తప్త అనగా వేడిచేయబడిన,కాచబడిన అని అర్థం.పరశు అంటే గండ్ర గొడ్డలి, ఆయుధము, వజ్రము అనే అర్థాలు ఉన్నాయి.గ్రహణ అంటే పట్టుకొనుట, స్వీకరించుట,పలుకుట, ధరించుట అనే అర్థాలు ఉన్నాయి.

తప్త పరశుగ్రహణ అంటే వేడిచేయబడిన గండ్రగొడ్డలిని పట్టుకొనుట అని అర్థం.

అయితే వేడి వస్తువులను పట్టుకోవడం సాధ్యం ఎలా అవుతుంది అనే అనుమానం రావచ్చు. కానీ మన ఇంట్లో వంట చేసే అమ్మ, బామ్మ అమ్మమ్మలను చూస్తుంటాం. వేడి పాత్రలను దింపడానికి, వాటిలో ఉన్నవి కలపడానికి రక్షణగా మన బట్ట,పట్టుకారు లాంటివి ఏమీ లేకుండానే చేతులతో పట్టుకొని అవలీలగా ఆ పనులు చేయడం.

చూసే మనకు మస్తు ఆశ్చర్యం కలుగుతుంది కదా! కానీ అలవాటు, అభ్యాసం వలన అది సాధ్యం అవుతుందనే విషయాన్ని ఈ న్యాయం చెబుతుంది.

క్రమ క్రమంగా వేడి వస్తువులను పట్టుకొనుట అలవాటు చేసుకుంటే చివరకు కాలుతున్న ఇనుప గొడ్డలిని కూడా పట్టుకొనవచ్చును. అంటే "అభ్యాసం కూసు విద్య" అనే అర్థంతో ఈ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

'అభ్యాసం కూసువిద్య 'లో కూసు అంటే చిన్న అని అర్థం.కూసువిద్య అంటే చిన్న చిన్నగా అభ్యాసం చేస్తూ వుంటే విద్య సులభంగా వస్తుందని అర్థం. అభ్యాసం వలన ఎంతటి కష్టతరమైన విద్య అయినా సులభంగా పట్టుపడుతుందనే అర్థంతో అభ్యాసం- కూసువిద్య అనే పదబంధాన్ని ఉపయోగిస్తారు

దీనికి సంబంధించిన తెలుగు సామెత కూడా ఉంది. "తెలిసే వరకే బ్రహ్మ విద్య-తెలిసిన తర్వాత కూసు విద్య'.అంటే తెలియనంత వరకు అమ్మో బ్రహ్మ విద్య సాధ్యం కాదని భయపడుతుంటాం. నెమ్మదిగా అభ్యాసం చేశాక భలేగా వచ్చేసిందని సంబర పడుతుంటాం కదా!.

దీనికి సంబంధించిన వేమన పద్యాన్ని చూద్దాం... 'అనగ నగగ రాగ మతిశయిల్లుచునుండు/తినగ తినగ వేము తియ్యనుండు/ సాధనమున పనులు సమకూరు ధరలోన/ విశ్వదాభిరామ వినురవేమ!'

అంటే పాడగా పాడగా రాగం చక్కగా కుదురుతుంది. అలాగే వేపాకును రోజూ తింటూ ఉంటే ఆ వేపాకు చేదుగా అనిపించదు. ఏ పనైనా రాదనుకుంటే రాదు. నేర్చుకోవాలనే సంకల్పంతో నిత్యం సాధన చేస్తే ఏ పనైనా చేయగలం.ఈ లోకంలో అన్ని పనులు చేయడం ద్వారానే సాధ్యపడతాయి. కాబట్టి సాధనే ముఖ్యమని తెలుసుకోవాలి.

మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న కొందరు వ్యక్తులు శారీరక వైకల్యాలను కూడా అధిగమించి ఎన్నో అద్భుతాలు సృష్టించారు.ఎన్నో ఆవిష్కరణలు చేశారు. వాటి వెనుక అకుంఠిత దీక్ష, నిరంతర సాధన ఉన్నాయి.

ఉన్నత శిఖరాలకు, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే సాధనే ముఖ్యమని ఈ తప్త పరశుగ్రహణ న్యాయము ద్వారా తెలుసుకోవచ్చు.

**-పురిమళ్ల సునంద**
*9441815722*



పుస్తక సమీక్షలు

## ఎద కదిలించే శంకర్ గజళ్ళ 'నీహారిక'

పారసీ, అరబ్బీ, ఉర్దూలలోని గజల్, రుబాయీ ప్రక్రియలు తెలుగు కవిత్వ తాత్త్వికత, భావ సౌందర్యాన్ని సంపన్నవంతం చేసిన ఆవిర్భావ, వికాసానికి ఆద్యులు మహాకవి వరేణ్యులు దాశరధి, సినారెలు. ఉర్దూ గజళ్ళలో ప్రణయ భావాలతో పాటు ఆసక్తికరమైన తాత్త్వికత హృదయాలను కదిలిస్తుంది. ఐదారు ముక్తకాల (ద్విపదలు) కవితా ప్రక్రియ గజల్ చందస్సుకు పరవశించి 'సౌపర్ణిక', 'సౌగంధిక'లతో పాటు 'నీహారిక', ల'హరిక'లను సూరారం శంకర్ తన గజల్ సాహితీ ప్రస్థానంలో ఆవిష్కరింపచేసారు. తన కవితలలోని భావాలకు బొమ్మలు వేసుకొనే సంప్రదాయాన్ని పాటిస్తున్న శంకర్ 'కవిత్వ-చిత్రలేఖ' అద్భుత సమ్మేళనంగా 'నీహారిక' హృదయాలను స్పృశిస్తుంది. నీహారిక సంపుటిలో 68 గజళ్ళున్నాయి. గజల్ ప్రక్రియ భూస్వామ్య విలువలను ప్రోది చేసే కవితా రూపం అనే విమర్శను తిప్పికొడుతూ శంకర్ అభ్యుదయ భావాల సామాజిక స్పృహను వీక్షింపచేసారు. "కీర్తికాంక్షకు సెలవు, సెలవు మేధకే జేజేలులే మానవాభ్యుదయాన కవితను కట్టుకుంటాను" అంటూ నా తఖల్లూస్, (చివరి షేర్‌లో తన పేరిట) శంకరని 'వినుతించుకుంటాను' అంటారు. ముఖ పుస్తక పఠనాగ్రేసా' అంటూ ఫేస్‌బుక్ కథనాలపై చురకలు, బడిని కోవెలగా ఆరాధన, సమాజంలోని వంచన, అసూయలను వ్యంగ్యాక్షర బాణాలతో సంధించారు. అంత్యప్రాసలుగా పదాలు కొన్ని గజళ్ళలో అద్భుతంగా కుదురుకున్నాయి. పిచుకలో ప్రేమ, పికములో ప్రేమ అంటూ 'ప్రేమ నొల్లక ఎంత కాలం దహిస్తుంటావు'? అంటూ ప్రశ్నిస్తారు.గజల్ సాహిత్యం, వచన కవిత్వం, గేయ, బాల సాహిత్యంలో సూరారం శంకర్ అభినందనీయమైన కృషి కొనసాగిస్తున్నారు. బాకా కవులు, రూకలపోక కాకుండా గుండెనిండా సౌందర్య, తాత్త్విక భావుకతను నింపుకొని, కవిత్వం ఆస్వాదించి నిత్యయవ్వనం పొందవలసినదిగా ఆకాంక్షించే సూరారం శంకర్, తెలుగు గజల్ సాహిత్య మాగాణంలో, ఎదవాకిట ఆమని చివురింప చేయగల సృజనాత్మక ప్రతిభా సంపన్నులు.



**ప్రతులకు:**
సూరారం శంకర్
ఇ.నెం.5-8-784/4,
అశోక్‌నగర్ కాలనీ
కామారెడ్డి-503 111
సెల్: 9948963141

**-జయసూర్య**
సెల్: 9440664610






నాటి తరం వారి కథలు నేటి తరానికి
**కథల వంతెన**

## ఓటన్న

అది మాలగూడెం. అక్కడున్న వాళ్లంతా రెక్కాడితే డొక్కాడేవాళ్లే. అక్కడున్నవన్నీ పూరి గుడిసెలు. అక్కడివాళ్లు అంతా పశువుల కాపర్లుగా పాలేర్లుగా పనిచేసేవాళ్లే.

23 ఏళ్ల క్రితం మాలగూడెంలో ఇప్పటి గాంధీనగరంలో భారతమ్మకు ఓ అందాల శిశువు జన్మించాడు. ఆ గూడెం వాళ్లంతా మొదటిసారిగా ఆ రోజే ఓట్లేసి వచ్చారు. ఓట్ల గుర్తుగా ఆ శిశువు పేరు "ఓటయ్య" అని పేరు పెట్టారు. తల్లి భారతమ్మ కొడుకును ఓటయ్యా అని, తోటివాళ్లు "ఓటన్నా"అని, కానింత పెద్దవాళ్లు "ఓటిగా" అని పిలిచేవారు. బుద్ధునికి కష్టాలంటె తెలియకుండా పెరిగినట్లు ఓటయ్య సుఖమంటే ఏమిటో తెలియకుండా పెరిగాడు. తల్లివేసిన పాచి సద్దికూడుతిని ముద్దుగా పెరిగి పశువుల్ని కాచేవాడు. 23 ఏండ్లకు తొలిసారిగా ఓటయ్యకు ఓటు హక్కు వచ్చింది. పోటీ చేసిన అయ్యగారు ఓటయ్యను తోటి పుల్లయ్యను గొడ్లకాడినుండి.

కారులో పట్నం తీసుకెళ్ళాడు.ఈ 23 ఏండ్లలో ఓటయ్య ఎక్కడికి వెళ్లలేదు. ఓటయ్య ఆ రోజు పట్నంలో సినిమా చూశాడు. హొటళ్లలో తియ్యటి రసగుల్లాలు తిన్నాడు. పెద్ద పెద్ద బంగళాలు చూశాడు. కోట్లు బూట్లు వాళ్లందరిని చూశాడు. ఇదంతా ఏమిటని తోటిపుల్లయ్యను అడిగాడు. "సుఖం" అన్న సమాధానం దొరికింది. "అబ్బ రసగుల్లా ఎంత తీయగా ఉంది. సినిమా ఎంత హాయిగా ఉంది. అమ్మ తనకు చెప్పలేదే జీవితం ఇంత తీయగా హాయిగా ఉంటుందని" అనుకున్నాడు. అయ్యగారినడిగాడు. "మీరు మాకు ఓట్లు వేయండి, మీకు బంగళాలు, బాటలు, మోటార్లు అన్నీ మీకు వస్తాయ"ని చెప్పాడు. ఆ రోజు ఓటు వేసి నడిచివచ్చిన ఓటయ్య తల్లినడిగాడు. "అమ్మా! నాకు రోజూ ఈచేదు సద్దికూడు పెడుతున్నావు. ఓటేసి పట్నంలో ఎంత తియ్యటి రసగుల్లాలు తిన్నాననుకున్నావు. అమ్మా! మీరెప్పుడు ఓటయ్యలేదా మన గూడానికి బంగళాలు, మోటార్లు, రోడ్లు రాలేదు. ఈసారి మేము ఓటేశాం. అన్నీ వస్తాయటగా అమ్మా!" అన్నాడు. కొడుకు అమాయకత్వానికి భారతమ్మ కన్నీరు గార్చింది. "నాయనా మేము 23 ఏండ్ల నుంచి ఓట్లు వేస్తూనే ఉన్నాము. కోట్లు లేవు, బూట్లు లేవు, బంగళాలులేవు. ఉన్న గుడిసెలు అమ్ముకొని యేటా ఒకళ్లు పోతున్నారు" అంది భారతమ్మ. మరి యీ ఓట్లెందుకో అనుకున్నాడు ఓటయ్య...

**"అబ్బ రసగుల్లా ఎంత తీయగా ఉంది. సినిమా ఎంత హాయిగా ఉంది. అమ్మ తనకు చెప్పలేదే జీవితం ఇంత తీయగా హాయిగా ఉంటుందని"**

**-మేరెడ్డి యాదగిరిరెడ్డి**
9949415798



## మాటలు

మనమాటలు
అప్పుడప్పుడు
చందనపుష్పాలా
సుగంధాలు చల్లుతుంటాయి
మల్లియల్లా
మనసులు దోస్తుంటాయి
గులాబీల్లా
గుబాళిస్తుంటాయి
మందారాల్లా
మకరందాన్నందిస్తాయి
తియ్యంగా
తేనెచుక్కలు చల్లుతుంటాయి
దీపాల్లా
వెలుగులు చిమ్ముతుంటాయి
సీతాకోక చిలుకల్లా
చక్కదనాలు చూపుతుంటాయి
జాబిలిలా
చల్లనివెన్నెల వెదజల్లుతుంటాయి
కోకిలలా
కమ్మనిస్వరాలు వినిపిస్తుంటాయి
మంత్రాల్లా
ముగ్ధలనుచేస్తుంటాయి.
మీ గళంనుండి
గాంధర్వగానం
వెలువడాలనుకుంటున్నాను
మీ కలంనుండి
మధురమామిడిసారం
పారాలనుకుంటున్నాను
మీ పెదవులనుండి
సుధారసం చిమ్మాలనుకుంటున్నాను
మీ హృదయంనుండి
ప్రేమాభిమానాలు
పొంగాలనుకుంటున్నాను.
నేను
మాటల ప్రేమికుడిని
పదాల ప్రయోగికుడిని
అందాలు వర్ణించేవాడిని
ఆనందాలు అందించేవాడిని.
నోరూరిస్తే క్షమించండి
ఆశలులేపితే సాధించండి
రంగంలోకిదింపితే తలచుకోండి
విజయంసాధిస్తే పొంగిపోండి

**-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్: 7981616630



## అదే

నిద్రలు కరువవుతుంటాయి
చేరువలు గుర్తొచ్చినప్పుడల్లా...!.
కళ్ళు మసకబారుతుంటాయి
దుఃఖ మేఘాలను
గుండె మోయలేనన్నప్పుడల్లా...!.
వేదన పెనవేసుకుంటుంది
కన్నపేగు కలుక్కుమన్నప్పుడల్లా...!.
మౌనం పెదవి పీఠాన్నలంకరిస్తుంది
ఒంటరితనం
కావలించుకున్నప్పుడల్లా...!
దూరాలు మరింతగా
వృద్ధి చెందుతాయి
కలయిక ఇప్పుడప్పుడే
సాధ్యం కాదని తెలిసాక!.
ఎంతకీ కరగని రాత్రిళ్ళు!
అదే పీడకల!

**-వెగ్గలం ఉషశ్రీ**
9440370066



## దేశానికి ఒక వెలుగు రాజ్యాంగం

దేశానికి దిక్సూచి మన రాజ్యాంగం
అణగారిత నుండి సమాజానికి నాగరికత నేర్పిన గ్రంథం
చీకటిని పారదోలి ఒక వెలుగును నింపిన రాజ్యాంగం
దేశమనే దేహానికి గుండె లాంటి రాజ్యాంగం!!.
దేశ నడవడిక దేశ ప్రగతికి రాజ్యాంగం
ప్రజలకు ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పించేది
ప్రజాస్వామ్యానికి ప్రజలకు పవిత్ర గ్రంథం
హక్కులను రక్షించేది దేశ సంపద రాజ్యాంగం!!.
భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి
చాటి చెప్పిన పవిత్ర గ్రంథం
భావితరాలకు బాట రాజ్యాంగం
రాజ్యాంగంతో అందరికీ సమన్యాయ పాలన
రాజ్యాంగంతో అందరికీ
సమన్యాయ అవకాశాలు
అందరికీ పవిత్ర గ్రంథం రాజ్యాంగం
మన రాజ్యాంగాన్ని
మనం గౌరవిద్దాం
మన రాజ్యాంగాన్ని మనవే
కాపాడుకుందాం!!

**-దేవులపల్లి రమేశ్,**
9963701294

## పావురం చిక్కు

అనగనగా రామాపురం అనే ఊరిలో ఒక పేద కుటుంబం ఉండేది. రామయ్య, అనిత దంపతులకు సంహిత, రీతు ఇద్దరు పిల్లలు ఉండేవారు. అందరూ కలిసి ఆనందంగా జీవించేవారు. తల్లిదండ్రులు కూలీపనులు చేస్తూ జీవించేవారు. పిల్లలిద్దరూ బడికి వెళ్లేవారు. ఒకరోజు వాళ్ళ ఇంటికి వస్తుంటే దారిలో ఒక పావురం కాళ్లకు దారం చుట్టుకుని ఉన్నది. పావురం ఎంత గింజుకున్నా దారం చిక్కు మాత్రం పోవడం లేదు. పావురం కాలుకు గాయమై రక్తం కారసాగింది.

ఇద్దరూ కలిసి పావురం కాళ్లకు ఉన్న దారం తీయడానికి ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా చిక్కు మాత్రం పోవడం లేదు. చివరకు ఎలాగో ఒకలాగా దారాన్ని తీసివేశారు. కానీ గాయంతో పావురం ఎగర లేకపోయింది. గాయమైన ప్రాంతంలో పావురానికి కట్టుకట్టి, తమ ఇంటికి తీసుకువెళ్లారు. సంహిత, రీతులు పావురాన్ని చూసి, చాలా సంతోషించారు. రెండు రోజులపాటు పావురాన్ని చిన్న పిల్లలు జాగ్రత్తగా చూసుకుని, దానికి విత్తులతో భోజనం కూడా పెట్టారు. తర్వాత పావురం తన గూడుకు వెళ్ళింది. పావురం అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికి వచ్చి సంహిత, రీతులతో పక్షి భాషలో మాట్లాడుతూ ఎగిరి వెళ్ళేది. పావురం వచ్చినప్పుడల్లా అందరూ సంతోషించేవారు.

నీతి; ఆపదలో ఉన్న ఎవరినైనా రక్షించాలి. అప్పుడే మనసు సంతోషంగా ఉంటుంది.

**-సన**
ఎనిమిదవ తరగతి
జడ్‌పిహెచ్‌ఎస్ హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా, 9849575014






తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు..

నిర్వహణ-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## చెలియ అలిగింది !!

చార్ మినార్ చౌరస్తాలో
ఇరాన్ ఛాయ్ తాగించ లేదని
పొద్దు పొద్దునే చెలియ అలిగింది
గరమ్ గరమ్ !.
స్టార్ హోటల్లో అభిరుచుల
లంచ్ ఇవ్వ లేదని
మధ్యాహ్నం చెలియ అలిగింది !!
నాకు ఏకాదశి ఉపవాసం.
షాపింగ్ మాల్లో కొత్త రకం
ఫ్యాషన్ డ్రెస్ గిఫ్ట్ గా ఇవ్వ లేదని
చెలియ సాయంత్రం అలిగింది !
కొత్త బట్టలు ఇక తొడిగినట్లే
పండగలు లేనట్లే!!.
చెలికి అలుగుడే తెలుసు !
మూతి ముడుచుడే తెలుసు
నెల ఆఖరులో
నా పర్సు బరువు తగ్గిందని
చెలియకేం తెలుసు !!.
చెలియ మూడు పూటలు అలుగుడే !
రోజంతా వర్థిగా గడుచుడే !.
చెలియ నాన్ విజిటేరియన్
నేను విజిటేరియన్ !
ఇక ఏమీ అడగదు
నన్నే తినేస్తుందేమో!!.

-కందాళైరాఘవాచార్య
8790593638

## ఈ గది మూగది

మౌనంలోనే పరీక్ష
మౌనములోనే ఫలితం
బేంచీ కొకళ్ళు కూర్చున్నారు
భోజనానికి సిద్ధమైనట్టు
వాళ్ళ కాపలాదారు కొరకు ఒకరో ఇద్దరో.
కంచాలు కాదు కాగితాలు పట్టుకున్నారు
వాళ్లు పట్టుకున్న కలాల నుండి
చీమలై దూకుతూ అక్షరాలు -
బట్ట మీద కుట్టు మిషన్ నడుస్తున్నట్టు చేతివేళ్లు -
గీత గీసిన లైన్ల మీద వరుస పెట్టి నడుస్తూ రైలు -
మూతి మూడేసిన మౌనముద్ర తపస్సు కన్నా గొప్పది
శ్రవణ స్తంభనంతో ప్రాణరహిత ప్రాంతంలో సంతరిస్తున్నట్టు
నిగూఢ రహస్య నిశ్శబ్దం నీడలు సంచరిస్తున్నాయి గదంతా -
నిశ్శబ్దం ఎంత సుఖమో అంత భయంకరం
ఆలోచన ఎంత అద్భుతమో అంత అగాధం
భ్రమనుపడింది ..... వాతావరణమంతా కిటికీలోంచి
గాలిరెప్పల రెపరెపలు గానీ
కిటికీ అవతల చెట్టు కొమ్మల మీద
ఆకుల చిలుకల కువకువలు గాని లేవు
చుట్టూ చతుర్భుజాల నిలువెత్తు
గదిగోడలు నాలుగు శవాలై వేలాడుతుంటే
కిటికీలు గుడ్లు తెరిచిన శివశక్తులై
గుమ్మం నాలుక సాచిన కాళికై భయపెడుతుంది
రక్షణ జయమో పరీక్ష భయమో తెలియదు.
చుట్టూ తిరిగేవాళ్లు వాకింగ్ చేస్తున్నట్టు ఇన్విజిలేటర్లో స్క్వాడో తెలియదు
స్తబ్దంగానే గంటంతో గీస్తూ
రాసేది పరీక్షనో పవిత్ర గ్రంథమో తెలియదు
పేజీలకు పేజీలు నింపేస్తున్నారు.
అది భవిష్యత్తులో భాగ్యాన్నీ భవితవ్యాన్నీ
ఓ మెట్టిపిస్తుందో లేదో తెలియదు
ఇక్కడ మాత్రం మౌన మాయా ప్రపంచం రాజ్యమేలుతుంది
కళ్ళున్నా కబోది
వినికిడి ఉన్నా చెవిటిది
నోరున్నా మూగది ఈ గది
నిశ్శబ్దంలో గుండె ఆగుతుంది
నిశ్శబ్దంలోనే ప్రాణం పుడుతుంది.

-కందుకూరిశ్రీరాములు
9440119245

## స్వచ్ఛత

ఆలోచనలు వక్రమైనప్పుడు
ఎద నిండా కలుషితమే
ముఖమంతా పరచుకున్న
సన్నని నవ్వు వలువ వెనుక
గుప్త విషనాగుల విన్యాసాలు
అరలుగా ఏర్పడిన అరమరికలు
బంధాల దూరాలకు
అడుగులు వేస్తుంటాయి.
అంధకారాన్ని నింపుకున్న కళ్ళు
వేకువను గుర్తించలేని తడబాటులో
మూగగా రోదిస్తుంటాయి
తప్పిపోతున్న కాలాన్ని
పిడికిట బిగించాలనుకుంటే
మిగిలేది శూన్యమే.
మనసు గీసే వక్ర రేఖలను
అనుక్షణం చెరపక పోతే
పెనవేసుకున్న
పేగు బంధాల విలువలు సైతం
పేలికలై నశించిపోతాయి
మనిషిగా జీవించాలంటే
పవిత్రత దేహానికే కాదు
చాలా అవసరం
అంతరంగానికి కూడా.
ఎదురుగా కనబడే
అద్దంలో చూసుకొని
మురియడం కాదు
మనో దర్పణంలో
నీ స్వచ్ఛతకు
ప్రమాణమెంతో తెలుసుకో !!

-అరుణ ధూళిపాళ

## ఒక్క మాట ఒక లోకమైతది

తన గూర్చి
పెదాల వింటి నారి సారించి
మనస్సు పూల బాణం వెయ్యరాదు
తడిసి ముద్దయితడు
గుండెలో దాచుకుంటడు భద్రంగా
అది చెట్టు అయి విరగభూస్తది
మంచితనాన్ని
అడుగులకు కట్టుకొని
ఆ శబ్దాలతో నడుస్తాడు
మాటల గులకరాళ్లు గుండెకు
తాకిన దులిపేసుకుంటాడు
నిందల అపనిందల
దుమ్ము చల్లిన కడిగేసుకుంటాడు
లోకం ఆనందమంతా
తనదేనంటాడు
కళ్ళలో మెరుపులు
మాటలలో స్వచ్ఛత
నడతలో మంచిని పూస్తాడు
దానిని శరీరం నిండా పూసుకొని
భుజానికి వేసుకొని
సాగిపోతూ ఉంటాడు లోకమంతా
లోకమంతా ఇలానే మంచి వనమైతే
ఎంత బాగుంటుందో
ఓర్పులో నేల తల్లిని పోలీ ఉంటాడు
ప్రేమలో ఆకాశాన్ని మించి ఉంటాడు
చల్లని తనంలో
చందమామలా ఉంటాడు
అది ఒక్క మాట పోసిన రూపం
ఒక్క మాట తెచ్చిన మార్పు

-గుండెల్లి ఇస్తారి
9849983874

## కెరటం

ఏ తుళ్లింతలు లేకుండా వుంటే అది కెరటమెలా అవుతుంది?
ఏ అవస్థలు లేకుండా వుంటే అది జీవితమెలా అవుతుంది?
ఎగెసెగసి పడి తన ఎదపై గాలిని ముద్దాడి బిగి కౌగిలిగా బంధిస్తుంది
కెరటం ..
తడబడినా, నిలబడినా అమాంతం
కూలబడ్డా గుండె పదునెక్కి పదమంటది మనిషిని ముందుకు
పడ్డా లేవడమే కెరటం అస్థిత్వం
క్రిందపడ్డా లేవడం మనిషికెంతో అవసరం
ఆకాశాన్ని అందుకోవాలనే ఉబలాటం నిత్యచైతన్యసంగీతమే నురగల కెరటం
అవకాశాల్ని అందుకొని సంఘర్షించాలి.
సంతోష,సంక్షోభాలు శృతిలయలైన కదనగీతమే
నూరేళ్ల మనజీవితం
కెరటం జీవితానికి ఆదర్శం కావాలి అనునిత్యం
పడ్డందుకు కాదు పడిలేచినందుకు.

-రమేశ్ నల్లగొండ

## కొక్కోరో కో !

కొక్కోరో కో కొక్కోరో కో
రెక్కలు విదిలించి
కోడి కూత కూసే!.
రే రాజుతో కులికిన తార
సిగ్గుపడి పులకించి
వెలుగు తెర వేసే !.
మేలుకో మేలుకో
చీకటిని తొలగించి
వెలుగు తొంగిచూసే!.
ఉంగా ఉంగా పాపాయి
చెంగు చెంగున తువ్వాయి
ఎగురుతూ గంతులు వేసే !.
గూడు విడిచి పక్షులు
నింగిలోకి ఎగురుచుండ
మేల్కొన్న పల్లె పనులకేగే !
అల్లారం, హారనులు
మోతలు మోగంగ
పట్నం పరుగు పరుగే !
పురుగు పుట్ర గింజల మేత
పిల్లల పెంపకంలో పులంత
తల్లిని తలపించు మాత!
ప్రాణమున్న గడియారం
జాము జాముకు అల్లారం
మేల్కొ మంచి వ్యవహారం!
పౌరుషానికి మారుపేరు
ప్రాణాం లెక్కచేయ్యక పోరు
పల్నాటియుద్ధం మరిచిపోరు!
కోడిపై ఎన్నో సినిమాలు
ఎన్నో పరాచికాల పాటలు
సంప్రదాయ పందాలు!
యాల్లగానియాల్ల కూసినకోడి
ఒళ్ళంతా చూపలేని
గాయాల పాలైంది!
నాటు నాటు కోడి
నాణ్యమైన కోడి
పట్టబోతే ఊరంతా గాయి!
కోయకు కోయకు కోయకు
అంటది కోడి కోస్తే రేపు
కూసేది ఎవరంటది ?

-పి.బక్కారెడ్డి
9705315250

# నేను కాదు గదా...

(కథ)



బెంగుళూరు.

హుడీసర్కిల్.

బసవనగర్ రోడ్డు.

ఉదయం పదకొండు గంటలు.

ఆ రోజు ఆదివారం కావడంతో, సంత జరుగుతోంది.

యధాప్రకారం అనురాగ్ కూరలు కొని, తన బైక్ మీదవస్తున్నాడు.

ఆ నాలుగు రోడ్ల సెంటరువద్ద , రోడ్డుపక్కన జనం గుంపుకూడారు.

ఫొటోలు తీసేవాళ్ళు, తీసుకుంటున్నారు. చోద్యం చూసేవాళు చూస్తునే ఉన్నారు.

అనురాగ్, అక్కడకు వచ్చాడు. జనం, గుంపుని చూసి, బైక్ స్లో చేశాడు. ఈ లోపల, అక్కడ వాళ్ళ, అపార్టుమెంట్ మిత్రుడు రామారావు కన్పించాడు.

"రామారావు, ఏమైంది, అందరూ పోగయ్యారు" అని అడిగాడు,అనురాగ్.

"ఎవరో ఒక ముసలాయనను, బైక్ వాడు యాక్సిడెంట్ చేసి , వెళ్ళిపోయాడు" అన్నాడు రామారావు.

"మరి సహాయం చేయవచ్చుగా" అన్నాడు, అనురాగ్.

"నేను కాదు గాదా, మనకెందుకు, అనవసర తలకాయనొప్పి, పోలీసు కేసైనా కావచ్చు " అని వెళ్ళిపోయాడు, రామారావు.

రామారావు అంతే, ఏ విషయములోను పొరపాటున కూడా కల్పించుకోడు. ఏమన్నా అంటే, నేనుకాదు గదా, అంటాడు. అపార్టుమెంటులో పండుగలు, ఫంక్షన్లు జరిగినప్పుడు కూడా, పదిరూపాయలు కూడా చందా ఇవ్వడు. అపార్టుమెంట్లో, అందరికీ, రామారావు అంటే, చచ్చేంత ఒళ్ళుమంట.

అనురాగ్ గుంపులో జొరబడి, ఆ ముసలాయనను చూశాడు, సుమారు డెబ్భైఏళ్ళు ఉంటాయి. స్పృహలోనే ఉన్నాడు. తలకు చిన్నగాయమయ్యి, రక్తస్రావం జరుగుతోంది.

దేనికోసమో వెతుకుతున్నాడు, ఆయన .చుట్టూతా జనం, చోద్యం చూస్తున్నారు. ఫోటోలు, వీడియోలు తీస్తున్నారు.

అనురాగ్ వెంటనే వాటర్ బాటిల్‌లో నీళ్ళు, ఆయనకు, అందించాడు.

ఆయన గటగట తాగేశాడు. ఆయనను కూర్చోపెట్టి" మాష్టారూ, దేనికోసం వెతుకుతున్నారు" అని అడిగాడు, అనురాగ్.

"నా చెప్పులు కన్పించటం లేదు" అన్నాడు ఆయన.

పక్కనేవున్న, పాతహవాయి, చెప్పులు చూపించి..ఇవేనా"అని అడిగాడు అనురాగ్.

"ఆ, ఇవే" అంటూ, చెప్పులు వేసుకున్నాడు ఆయన.

"తల నుంచి రక్తంకారుతోంది, డాక్టరు దగ్గరకు వెడదామా" అన్నాడు అనురాగ్.

తల తడిమి చూసుకుంటే, చేతికి రక్తం అంటింది.డాక్టరు దగ్గరకు వెడదామని తలూపాడు ఆయన.

జనం అంతా అలా, చోద్యం చూస్తునే ఉన్నారు.

అనురాగ్ ఆటోపిలిచి, ఆయనను ఎక్కించి, పక్కనే కూర్చొని, దగ్గరలో తెలిసిన డాక్టరు అడ్రసు చెప్పి, ఆటో పోనివ్వమన్నాడు.

డాక్టరు చూసి, డ్రెస్సింగ్ చేసి, ఎటువంటి ప్రమాదము లేదు, ఇంటికెళ్ళొచ్చు అని చెప్పాడు.

అనురాగ్ "మాష్టారూ, మీ వాళ్ళ నెంబరిస్తే, ఫోను చేసి, చెబుతాను" అన్నాడు.

ఆయన చెప్పిన నంబరుకు ఫోనుచేశాడు అనురాగ్.

వాళ్ళ అమ్మాయి వచ్చి, అనురాగ్‌కు థాంక్స్ చెప్పి, డాక్టరు బిల్లు కట్టి , ఆయనను తీసుకుని వెళ్ళింది.

వాళ్ళు, వెళ్ళిపోయాక డాక్టరు, అనురాగ్ ని "ఆయన మీకేమవుతారు" అని, అడిగాడు.

"ఏమీకారు, పేరు కూడా తెలియదు" అన్నాడు అనురాగ్.

"నిజంగా, మీరు చాలాగ్రేట్. మానవత్వం అంటే ఏమిటో చెప్పారు, అందరూ మీలా ఉంటే, దేశం ఎప్పుడో బాగుపడేది"అని మెచ్చుకున్నాడు డాక్టర్.

×××

కరోనా భీభత్సంగా విజృంభించింది. జనం పిట్టలులా రాలుతున్నారు.

ప్రతీ అపార్టుమెంటులో అరడజను కరోనా కేసులున్నాయి. ఆ ఫ్యామిలీలన్నీ, ఐసొలేషన్‌లో ఉండాలీ, వాళ్ళ ఇళ్ళ నుంచి బయటకు రాకూడదన్నారు. శ్మశానాల దగ్గర శవదహనాలకు బంధువులు క్యూలు కడుతున్నారు. కరోనా విజృంభణకు, జనం భయంతో విల విలలాడుతున్నారు.

కరోనా కేసు వచ్చిన సందు దగ్గర పోలీసులు బారికేడ్లు కట్టి, జనం రాకపోకలను నిషేధించి, కరోనా ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

శానిటరీ వర్కర్లు వీధివీధంతా, బ్లీచింగ్ చల్లుతున్నారు. కరోనాతో హాస్పిటల్ లో చేరితే,మరణిస్తే, అట్నుంచి అటే , హాస్పిటల్ వాళ్ళే అంత్యక్రియలు.ఆఖరికి, ఆఖరుచూపులుకూడా లేవు. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ప్రముఖులు, కోటీశ్వర్లు కరోనాతో మరణించారు.

కరోనా వ్యాధికి ధనవంతుడు,పేదవాడు తారతమ్యం లేదు. ఇంట్లో ఒకరికి వస్తే, అందరికీ రావటం ఖాయం.

రామారావుకు కరోనా వచ్చింది. పదిహేనురోజులు ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉండాలని అపార్టుమెంటు కమిటీ తీర్మానించింది. రెండురోజుల తర్వాత ,రామారావు భార్యకు, కరోనావచ్చి, మంచానపడింది. రామారావు ఆ విషయం వాట్సప్ ద్వారా అందరికీ తెలియజేసి, సహాయం చేయమని కోరాడు.

అపార్టుమెంటు సెక్రటరీ వాళ్ళకి, ఫుడ్ క్యారేజీ ఇచ్చే వాళ్ళు, ఇవ్వవచ్చుని, వాళ్ళకి పూర్తి సహాయ సహకారాలు అందివ్వమని, మెసేజీపెట్టాడు.

అపార్టుమెంటు వాళ్ళంతా, అప్పటిదాక,కరోనా బాధిత కుటుంబాలకు, అన్ని సహాయ సహకారాలు, క్యారేజీలు, అందించే వారు.రామారావు విషయం తెలిసినా, మిన్నకుండి పోయారు. రామారావు స్విగ్గీ, జొమాటో వాళ్ళకు, ఫోను చేశాడు. అపార్టుమెంట్లో , కరోనా తగ్గేదాకా ,వాళ్ళను అనుమతించమని, చెప్పాడు సెక్రటరి.

రామారావు పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యింది. భార్య, భర్త, ఇద్దరూ మంచాన పడ్డారు. తిండి తిప్పలు లేవు. రామారావు భార్య. అనురాగ్ ఇంటికి ఫోను చెయ్యమంది. అనురాగ్ మాటంటే, ఆ అపార్టుమెంటు వాళ్ళందరికీ , వేదవాక్కు.

ఎందుకంటే, ఎవరికే ఏ సహాయం కావలన్నా,ఏ సమస్య వచ్చినా, ముందు గుర్తుకొచ్చే పేరు, అనురాగ్.

అందర్నీ, తనంటతనే, అడిగిమరీ తోచిన సహాయం చేస్తాడు,అనురాగ్. రామారావు,అనురాగ్ పనిచేసేది,ఒకటే ఆఫీసు.అనురాగ్ పేరులానే, ఆఫీసులోనూ అన్నీ, అనురాగ్‌కు కల్సివస్తుంటాయి.

ప్రమోషన్లనుంచి క్యాష్అవార్డ దాకా అన్నీ అనురాగ్ వే. అందరికోసం ఒక్కడు, ఒక్కడికోసం అందరు అన్నమాటకు ప్రతీక అనురాగ్.

నిజం చెప్పాలంటే రామారావుకు అనురాగ్ అంటే, ఒళ్ళుమంట. కానీ, భార్యకు కూడా కరోనారావడంతో, రెండు రోజుల నుంచి వంటవండే వాళ్ళులేక, ఇంట్లోవున్న పళ్ళు, పలహారాలతో సరిపెట్టుకుంటున్నారు.

అయినా, అభిమానం చంపుకొని, అనురాగ్, ఇంటికి ఫోనుచేశాడు. అనురాగ్, ఊళ్ళోలేడని, రాత్రికి వస్తాడని, చెప్పారు.ఆ వార్తవిని రామారావు, భార్యతో" అనురాగ్, ఊరు వెళ్ళాడు, రాత్రికి వస్తాడు, అంటే, రేప్పొద్దుటి నుంచి మనకి క్యారేజీ వస్తుంది అన్నమాట,అనురాగ్ మాట, ఎవరూ జవదాటరు, అపార్టుమెంట్లో"అన్నాడు.

**మనం మనుషులం , ఒకళ్ళకొకళ్ళం, సహాయం చేసుకుంటే, జీవితాలు హాయిగా సాగిపోతాయి. మానవత్వమే దైవత్వము.**

ఆ మాటవిని , రామారావు భార్య సీత ఇంత ఎత్తున ఎగిరిపడింది." అంటే, అనురాగ్ గారు వచ్చి చెబితేగానీ, అపార్టుమెంట్లో మనకు, క్యారేజీ పంపరన్నమాట, ఏనాడైనా పిల్లికి బిచ్చం పెట్టావా,ఎవరికైనా ఏ సహాయమైనా, చేశావా..ఎప్పుడూ, నేనుకాదుగదా అన్నట్లుండేది, నీ ఆలోచనా ధోరణి, అందుకే, రెండురోజులు నుంచి పస్తులుంటున్నాము,నీ పద్ధతి మార్చుకో, లేకపోతే విడాకులే" అంది. ఎన్నడు, పల్లెత్తుమాట, అనని భార్య సీత, అన్ని మాటలు అనేసరికి, రామారావులో అంతర్మధనం ప్రారంభమైంది.

×××

రాత్రి పదకొండు గంటలు.

జోరున వాన పడుతోంది.

రోజూ మింగుతున్న మందులు ,కడుపులో ఆహారంలేక, మంటను తెప్పిస్తున్నాయి. అలానే, ముడుచుకొని, పడుకున్నారు, రామారావు దంపతులు.

అప్పుడు మోగింది కాలింగ్ బెల్.

రామారావు లేచి,తలుపు తీశాడు.ఎవరూ లేరు. అన్నం క్యారేజి ,గుమ్మం ముందు ఉంది. బహుశ, అనురాగ్, వచ్చి ఉంటాడనుకున్నాడు రామారావు.

క్యారేజిలోని వేడి, వేడి అన్నం, బంగాళ దుంపల కూర, సాంబారు,కొబ్బరి పచ్చడి, కంచంలో వడ్డించింది సీత.

ఆవురావురుమని తిన్నారు,రామారావు, సీత.

"భోజనం చాలా బాగుంది కదండి, ఈ ఉత్తరంకూడా ఉందండీ, క్యారియర్లో" అని ఉత్తరం అందించింది సీత.

ఆ ఉత్తరంలో,

"డియర్ రామారావుగారు,

మీ విషయం తెల్సి చాలా బాధపడ్డాము. అయితే, నేను కాదుగదా, అన్న మీ ధోరణి , ఎవరు? ముందుకు వచ్చి మీకు సహాయం చేయకపోవడానికి, కారణము.మనిషి సంఘజీవి.

మీరు ఇప్పటికైనా మారితే,అందరితో కలసిమెలసి ఉంటే మీ పక్కన ఉండే వర్మగారు, పైన ఉండే, విజయ్ గారు,కింద ఉండే ఫణిగారు, అందరు మీకు సహాయం చేయడానికి, మీకు, కరోనా తగ్గేదాకా, క్యారేజీ ఇవ్వడానికీ సిద్ధం. మనిషిలో మార్పే మా తీర్పు.ఇతరులు మీ పట్ల ప్రేమగా ఉండాలంటే, మీరూ ఇతరులకు ప్రేమను పంచాలీ , ప్రేమించు ప్రేమకై అన్నారు పెద్దలు, ఆఖరుగా, రోడ్డు మీద యాక్సిడెంట్ అయితే, నేను కాదు గదా ,ఎవరో ముసలాయన,అని మీరు పట్టించుకోకుండా వెళ్ళిపోయిన, ముసలాయన కూతుర్ని నేను.

నేను, మీ ఫ్లోర్లులోనే ఉండే రాధికను, అనురాగ్ గారు ఫోను చేసి మీ విషయం చెప్పి, సహాయం చెయ్యమన్నారు.

ఇప్పటికైనా, మీరు మారితే,ఇలా అందరం ,మీకు సహాయం చేయటానికీ సిద్ధంగా ఉన్నాం.

మనం మనుషులం , ఒకళ్ళకొకళ్ళం, సహాయం చేసుకుంటే, జీవితాలు హాయిగా సాగిపోతాయి. మానవత్వమే దైవత్వము.

ఇట్లు

రాధిక

అని ఉంది ఆ ఉత్తరంలో.

అ ఉత్తరం, చదివిన రామారావుకు, కంటివెంట ధారగా కన్నీళ్ళు కారాయి.తిన్న అన్నం నోట్లోకి వచ్చింది.

నోటమాటరాలేదు. అనురాగ్ సాయం చేయమని చెప్పినా, ఎవరో ముసలాయన.. నాకెందుకు అని దులపరించుకొని వచ్చేశాడు. ఇవాళ వాళ్ళ అమ్మాయి పంపిన క్యారియరే, తమకు గతి అయ్యింది. కన్నీళ్ళు ధారగా కారుతుండగా, అందరికీ థాంక్స్ చెబుతూ, ఫోన్ చెయ్యసాగాడు.

అతనిని చూస్తూ, సీత

"ఫర్వాలేదు, రేపు ఫోను, చేసి, థాంక్స్ చెబుదురుగాని" అంది.

రామారావు, అపార్టుమెంట్లో అందరికీ థాంక్స్ చెప్పడానికి, కన్నీళ్ళతో ఫోను ముందు కూర్చున్నాడు.



-ఎం.వి.చంద్రశేఖరరావు
సెల్9989362703.




రణం
ప్రయాణం
మానవునికి దారి చూపే గురువు వాతావరణం
-డా.రమ్య స్వరూప్
హైదరాబాద్

వాదించు
విభేదించు
నిప్పులాంటి నిజాన్ని వెలికితీసి...అబద్ధాన్ని
చేదించు
-కోటమహంతి వెంకటరావు(కోవెరా),
విశాఖపట్నం

లోచనలు
సమాలోచనలు
మంచి అనుభూతులు, ఫలితాలనిస్తాయి
అనుకూలమైన ఆలోచనలు.
-కే. ఎం. కే. మూర్తి
సికింద్రాబాద్

ఇంధనం
బంధనం
ఆద్యంతాలు లేని సత్యాన్వేషణే మన ధనం.
-కత్రోజు నర్సింహాచారి,
సికింద్రాబాద్.

అప్పుడు
ఇప్పుడు
కాలం ఏదైనా -మారదు దైవం ఎల్లప్పుడు
-పప్పు సుజాతారావు
వైజాగ్

జీవనం
భావనం
మానవుడు ఈనాడు కల్పించాడు దురాశకు
నిత్యయౌవనం
-సూర్యదేవర రవికుమార్
గుంటూరు

అర్థము
కర్దము
అందరూ ఒకేలా యోచిస్తారనే భావం వ్యర్థము
-అభిషేక్, హైదరాబాద్

చేరాయి
మారాయి
యువతలో విపరీత ధోరణులతో
సాంప్రదాయాలు దిగజారాయి.....!!
-శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

కాల్పనికత
వాస్తవికత
సత్యానికి అవసరం లేదు ఎటువంటి
ప్రామాణికత.
-డి వి వి ఎస్ మూర్తి
హైదరాబాద్

గ్రామం
ఆరామం
పయనించే పక్షికి వలస నిత్యనీ సంగ్రామం!
-వీరేశ్వర రావు మూల
అమలాపురనీ

జనాలు
భోజనాలు
ఉల్లాసంగా విందులు -వ్యర్థాలతో
చిన్నబోయిన వనాలు
-అచ్యుతుని రాజ్యశ్రీ
హైదరాబాదు

పిలుపు
మలుపు
ఉన్నస్థితి ఉన్నతస్థితికి చేరడమే నిజమయిన
గెలుపు
-ధరణికోట శివరామప్రసాద్,
హైదరాబాద్

నాదారి
నీదారి
ఉమ్మడికుటుంబాలు కనుమరుగు అయ్యాక
అందరిదీ తలోదారి.
-టి.రామాంజనేయులు
ఆదోని,కర్నూలుజిల్లా

అడుగు
మడుగు
జీవితంలో ఓటమి ఎదురైందని వేయకు
వెనకడుగు
-మహర్ణవ్ రెడ్డి (6.వ.తరగతి )
హైదరాబాద్

పుణ్యము
నైపుణ్యము
మనుషులు కలిగి ఉండాలి మూగజీవాలపై
కారుణ్యము!
-పట్నాయకుని రామకృష్ణారావు
కంచరపాలెం.విశాఖపట్నం.

సత్యము
నిత్యము
పలుకువాడు జగమున ఎన్నదగిన సిసలైన
ముత్యము.
-బత్తిన గీతాకుమారి
సత్తుపల్లి

రామేశ్వరము
శనీశ్వరము
ఎందువెదికినా అందేగలడు ఈశ్వరుడు
పోయిచూడు భువనేశ్వరము
-ఆర్. రమాదేవి
హైదరాబాద్

శ్రీకారము
సాకారము
క్షుణ్ణంగా కిటుకులు తెలుసుకొని మొదలెట్టాలి
వ్యాపారము
-కాళీపట్నపు శారద
హైదరాబాదు

చందాలు
గంధాలు
త్యజించడానికి సిద్ధపడాలి అందరూ ఇహలోక
బంధాలు!
-డాక్టర్ శైలజ మామిడాల
హనుమకొండ

గలాట
వెతుకులాట
జీవితంలో పెనుగులాట, ఆశనిరాశల మధ్య
ఊగిసలాట
-అంజనీదేవి శనగల
విశాఖపట్నం

వనాలు
భోజనాలు
కార్తీకమాసం ఉసిరిగ చెట్టు కిందే భక్తజనాలు
-పార్లపల్లె. నాగేశ్వరమ్మ.
(టీచర్. )నెల్లూరు .

ఐనోళ్లు!
కానోళ్లు!!
ఎవ్వరైనా ఎప్పుడైనా మెండైన మనసున్నోళ్లే
మంచోళ్ళు!!!
-నేమాన సుభాష్ చంద్ర బోస్,
విశాఖపట్నం

అదరదు
బెదరదు
ఇష్టమైన వాళ్ళమీద ప్రేమ ఎప్పటికీ చెదరదు
-ప్రసాద్ రావు,
విజయనగరం.

జంగల్
దంగల్
తీరప్రాంతాలను అతలాకుతలం చేస్తున్న
తుఫాన్ ఫెంగల్.
-బిక్కునూరి రాజేశ్వర్,
నిర్మల్

కలకలలు
గలగలలు
పంజరాలను తెరువ -వృక్షరక్షణతో పక్షుల
కిలకిలలు
-విత్తనాల విజయ కుమార్
హైదరాబాద్

ఆర్చలేరు
తీర్చలేరు
అన్యాయంపై పోరును అణగార్చి తుదకు
పరిమార్చలేరు!
-జీ యన్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

సైన్యము
హైన్యము
పదవిలోవుంటే కనిపించని భజనలకు అధిక
ప్రాధాన్యము.
-పుష్ప వేజ్కట శర్మా.
ఒడిశా.భువనేశ్వరము.

రక్షణ
శిక్షణ
పిల్లలకు ఎల్లప్పుడూ..నేర్పుతూ ఉండాలి
క్రమశిక్షణ.
-ఆ.రమా సత్యా దేవి.
హైదరాబాదు

మనము
ధనము
రెండు మాటలు దూరంగా ఉంచితే ఘనము
-అనుశ్రీ మెండు
హైదరాబాద్

సాంతం
అంతం
ఇజ్రాయిల్ పాలస్తీనా సంధి కుదుర్చుకుంటేనే
సుఖాంతం.
-బెహరా నాగభూషణరావు,
గజపతినగరం.

జనం
మనం
ఇరుకున పడ్డాం -అందుకే మేడెక్కింది
వనం !
-కె.కె.తాయారు
మదనపల్లి చిత్తూరు జిల్లా

రక్షలు
కక్షలు
చట్టాలే చుట్టాలయితే మన వ్యతిరేకులకే శిక్షలు
-డా.పి.వి.రామ కుమార్
హైదరాబాద్

అతడు
ఇతడు
కారుణ్యనీ ఎరుగనివాడు ఎందుకూ కొరగాని
బుడతడు !!
-యన్.కే. నాగేశ్వరరావు,
పెనుగొండ.

మౌనం
ధ్యానం
అవగాహన చేసుకుంటే జీవితసారాంశం
పెరుగును జ్ఞానం
-జె.విజయకుమారి
విశాఖపట్నం

కాయము
ప్రాయము
అనుకున్నది సాధించి తీరాలంటే
అత్యవసరం ధ్యేయము
-కానుకొలను లక్ష్మి సీత
హైదరాబాద్

ఏకులం
మేకులం
తొండి జగమొండి వారసుల
వాహనాలకు......చోదకులం
-కె. చెంచలరావు,
ఒంగోలు

దీపకాంతి
చంద్రకాంతి
సంపూర్ణారోగ్యానికి అవసరం ప్రకృతి
ప్రసాదించే సూర్యకాంతి
-నెల్లుట్ల శ్రీనివాసులు,
చెన్నై

తరంగం
చదరంగం
అర్థంకాని అత్యద్భుతమైన కావ్యం మగువ
అంతరంగం
-కుసుమ. పత్రి
తణుకు

వాదన
వేదన
మందభాగ్యునికి మంచి బోధించాలని
అనుకోవడం అరణ్యరోదన
-కామేశ్వరి వాడ్రేవు
హైదరాబాదు

దంతం
దాంతం
సముదాత్తం మనమాటల ఉదంతం ఆచరణలో
మెట్టవేదాంతం.
-డా.రామడుగు వేంకటేశ్వరశర్మ.
హైదరాబాదు.

## అమ్మమ్మ ఇల్లు

అమ్మమ్మ వంటింట్లో రుచులకు పరిమళం అద్దుతా వుంటే
సాయంగా అమ్మ అరుగుపై కూచుండి
బీడీలను ముద్దబంతిపూలను చేసేది
చిన్న స్టూలుని కారుని చేసి రయ్యి రయ్యిమని
నే ఊళ్లని చుట్టేస్తుంటే
'పయనించే ఓ చిలకా...' అంటూ తాతయ్య గొంతు రేడియో
వినిపించేది...
సెలవులకి మేమొచ్చామని తెలిసి
మా ' సరూపక్క భాగ్య చిట్టి' మా అమ్మా అమ్మమ్మల సంబురాల్ని
రెట్టింపు చేసేది...
ఆటలు పాటలు అమ్మా అమ్మమ్మల ముచ్చట్లు
కాసింత చదువు తెలిశాక
నే గ్రంథాలయంతో పరిచయం పెంచుకునేది
ఆకలి వేళకు కూడా పుస్తకాలతో ముచ్చట ఒడవక
'అచోకు' అమ్మమ్మ పిలుపు ఎండలో కూడా నడిచి వచ్చేది
ఎవరు నాటారో అమ్మమ్మ చెప్పలేదు
కానీ, ఆ రెండు సీతాఫలాల చెట్లు ఏటేటా ఆకాశాన్ని అంటేవి
చుట్టాలకు ఆ రుతువు అమ్మమ్మ ఇంటి చిరునామాని
మళ్లీ మళ్లీ తెలిపేవి
చిటారు కొమ్మన మిఠాయి పొట్లం
ఆకుల్లో దాగిన పగిలిన ఓ సీతాఫలం
'చక్రం' కు నాకు ఒకోసారి పోటీ పెట్టేది
ఎవరు గెలిచినా చెట్టు దిగిన ఆ సీతాఫలం
అందరి నోళ్లనూ తప్పనిసరి తీపి చేసేది...
చేద బావి పక్కన దబ్బ నిమ్మ కాయల చెట్టు
వాడకట్టు పులిహోర రుచికి తోడయ్యేది
అటుపక్కనే పెరిగిన కరివేపాకు మొక్కలు చెట్లై
ప్రతీ రుతువు
కూరగాయల వ్యాపారుల తరాజును చూపేవి
జాజి మల్లె ఆ చోటునంతా పరిమళం వ్యాప్తి చేస్తుంటే
నందివర్ధనం తన తెలుపును చూపి ఒక్కింత గర్వపడేది
గుడ్డును పొదుచుక బయటకు వచ్చిన ఓ కోడిపిల్ల
కళ్ళ ముందు పెరిగి పెద్దదయ్యేది
ఆకాశం దిగిన గద్ద రెక్కలకు
మేమంతా ఎపుడూ అడ్డుగా నిలిచేది
గోడ దూకి పరుగులు పెట్టే ఓ ముద్దుల కోడిపెట్టని
భద్రంగా పొదుముకుని గంప కింద కమ్మేది
సంక్రాంతికో దసరాకో అమ్మమ్మ వీటి లెక్కను
అప్పటికప్పుడు తగ్గించివేసేది...
ఓ ఉదయం ఇంటి ముందరి ఓ పెద్ద మనిషి
అమ్మకు తాతయ్య గురించి చేదు వార్తను తెలిపితే
చాన్నాళ్లకు మరో ఉదయం అమ్మమ్మ
పెద్దమ్మ దగ్గరకు వెళ్తూ అమ్మకు
తీరని దుఃఖాన్ని మిగిల్చింది
ఓ సాయంత్రం మామయ్య మరణం అమ్మకు చరవాణి
సందేశం వినిపిస్తే
ఒక కాళ రాత్రి అమ్మ అందరినీ వీడి వెళ్లిపోయింది
అందరినీ కోల్పోయిన అలనాటి అమ్మమ్మ ఇల్లు
ఆనవాలు కోల్పోయిన
జ్ఞాపకాల శిథిల గృహమై నిన్న కనిపించింది.



-అశోక్ గుంటుక
9908144099

